క్లుప్తంగా

నేడు గోదావరికి నీరాజనం

కొవ్వూరు: మాఘ పౌర్ణమి సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక గోష్పాదక్షేత్రంలో గోదావరి నదికి మహానీరాజనం సమర్పించనున్నట్లు నీరాజన సమితి అధ్యక్షుడు కలిగోట్ల కృష్ణారావు సోమవారం తెలిపారు. 233వ మాసోత్సవం సందర్భంగా గోదావరి మాతకు వివిధ రకాల హారతులతో మహానీరాజనం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



చివటంలో గర్భిణులకు ఆకుకూరలు, కూరగాయాలు అందజేస్తున్న సత్యనారాయణ

ఉండ్రాజవరం: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని చివటం పంచాయతీ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ అన్నారు. చివటం గ్రామంలో పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది స్వయంగా పండించిన ఆకుకూరలను గర్భిణులకు, బాలింతలకు సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది బేబి రాణి, సూర్యకుమారి, నిర్మల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు భోజన ప్యాకెట్ల అందజేత



రోగులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

నిడదవోలు : సత్యసాయి నిత్యాన్నదాన సేవా పథకంలో భాగంగా కారింకి వీరాయమ్మ వర్ధంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వారి కుమారులు సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, కొత్తపల్లి రవికుమార్, ఎండీ ఫయాజ్, చిక్కాల రాజ, సానేపు సుబ్బారావు, గిద్దా వేణుబాబు, కనకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జీతాల కోసం 'సత్యసాయి' కార్మికుల నిరసన



గోపాలపురం సత్యసాయి మంచినీటి ట్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

గోపాలపురం: సత్యసాయి మంచినీటి పథకంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు తమకు జీతాలు చెల్లించాలంటూ సోమవారం సత్యసాయి మంచినీటి ట్యాంకు వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకూ ఏడు నెలల జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. లక్షల మంది దాహార్తిని తీరుస్తున్న కార్మికులకు జీతాలు అందడం లేదని, దీంతో కుటుంబ సభ్యులు పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యపై కూటమి నాయకులకు, జిల్లా అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వెంటనే జీతాలతో పాటు పీఎఫ్ అందజేయాలని, లేనపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో యూనియన్ నాయకులు జి.శివ సత్యనారాయణ, ఆచంట సత్యనారాయణ, బి.బాబూ వరప్రసాద్, దాసరి రవి, పుచ్చకాయల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



చిక్కాలలో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

చాగల్లు: శాసన మండలిలో బడుగు,బలహీన వర్గాల గొంతు వినిపించడం కోసం ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకుడు పిల్లి శ్రీనివాస్ మూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, వివిధ సంస్థల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. గతంలో పీడీఎఫ్ తరపున ఎమ్మెల్సీలుగా గెలిచిన వారు రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులు, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై శాసన మండలిలో పోరాటం చేశారని గుర్తు చేశారు.

నులిమేద్దాం

- ఘనంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- గ్రామాల్లో జోరుగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



యర్నగూడెంలో పిల్లలకు నులి పురుగు నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ హరిచందన

కొవ్వూరు: నులిపురుగుల నివారణతోనే బాలబాలికలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని దొమ్మేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.ధర్మరాజు పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5,438 మంది ఉండగా వీటిలో 5,112 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. తొలిరోజు 94 శాతం మాత్రల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ సీహెచ్ దివ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చాగల్లు: విద్యార్థులు, చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిశిత తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 97 శాతం మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 17న పంపిణీ చేస్తామన్నారు. రక్తహీనత నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగాలని సూచించారు.

నిడదవోలు : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ మున్సిపల్, ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులకు మాత్రలు వేశారు. ఈసందర్భంగా నెహ్రూనగర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఈ తేజశ్రీ మాట్లాడుతూ చిన్నారులు బయట ఆహారం తినడం, మట్టిలో ఆడడం, కలుషిత నీరు తీసుకోవడంతో నులి పురుగుల బారినపడతారన్నారు. నులి పురుగుల ఉండడంతో చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాలు సమస్యలు ఎక్కువగా తలెత్తుతాయన్నారు. నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 20 పాఠశాలలు, 10 అంగన్‌వాడీ కేంద్రాలు, 7 కళాశాలల్లో 5,962 మంది 19 ఏళ్ల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామని డాక్టర్ తేజశ్రీ తెలిపారు.

నులి పురుగుల నివారణ చర్యలు

ఉండ్రాజవరం: పిల్లల్లో నులి పురుగుల నివారణకు తల్లిదండ్రులు బాధ్యత వహించాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్, వేలివెన్ను పీహెచ్‌సీ వైద్యులు ఇర్ఫాన్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూళన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులచే డీవార్మింగ్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండ్రాజవరం పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 7,302 మంది పిల్లలకు గాను, 6,450 మంది, వేలివెన్ను పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 7,652 మంది పిల్లలకు గాను, 7,225 మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు మింగించారు. సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్‌కే.ఖాన్, ఆరోగ్య పర్యవేక్షలు పాల్గొన్నారు.

దేవరపల్లి: నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత సమస్య ఏర్పడుతుందని దేవరపల్లి మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సీహెచ్ హరిచందన, డి.సాంబశివరావు, జె.సతీష్, బి.ప్రశాంత్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.



దొమ్మేరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



బ్రాహ్మణగూడెంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యులు



చిన్నారులకు మాత్రలు వేస్తున్న కౌన్సిలర్ వైద్యాధికారి తేజశ్రీ, ఆరోగ్య సిబ్బంది



ఉండ్రాజవరంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఉండ్రాజవరం ప్రసాద్

భగవన్నామ స్మరణతో సమస్యలు దూరం



నల్లజర్ల: నిత్యం భగవన్నామస్మరణతో సమస్యలు దూరమవుతాయని వేద పండితుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. అవపాడులో ముత్యాలమ్మ, కనకదర్గమ్మ ఆలయాల ప్రాంగణంలో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు మహా మృత్యుంజయ పాశుపత శ్రీమహారుద్రయాగ మహోత్సవ కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో జరిగాయి. చివరి రోజైన సోమవారం పూర్ణాహుతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కనిపిస్తున్న విశ్వమంతా భగవంతుని అనుగ్రహంతో నడుస్తుందని, భగవంతునిపై విశ్వాసం ఉంటే సమస్యలు తొలగిపోతాయన్నారు. నిత్యం దేవాలయాలకు వెళ్లి భగవన్నామస్మరణతో గడపాలని, తద్వారా కొత్త అనుభూతి కలుగుతుందన్నారు. సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. గ్రామంలో నూతన శివాలయం నిర్మించాలని గ్రామస్తులు తీర్మానించారు.

నేడు విద్యుత్ అంతరాయం

దేవరపల్లి: యర్నగూడెంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ పనుల నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు సోమవారం ఈ విషయం తెలిపారు. చిన్నాయగూడెం, యాదవోలు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో యాదవోలు, చిన్నాయగూడెం పాకలు, కుంతలగూడెం, వెదుళ్లకుంట ఫీడర్లపై వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. వ్యవసాయ అవసరాలకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

సరిహద్దులను కచ్చితంగా గుర్తించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



తాళ్లపూడిలో సర్వేపై వివవరాలను అడిగి తెలసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి: భూముల సర్వే సమయంలో కొలతల ప్రకారం సరిహద్దులను కచ్చితంగా గుర్తించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. తాళ్లపూడి సచివాలయంలో సోమవారం ఆర్డీవో రాణి సుస్మిత, సర్వే అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. భూముల రీసర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రెవెన్యూ సర్వే రికార్డు, క్షేత్ర స్థాయి భూముల సర్వే చేసిన రికార్డుల్లో వివరాలు సరిపోవాలన్నారు. సర్వే చేసేటప్పుడు క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సర్వే బృందం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు. జియోలొకేషన్ రికార్డు ఇమేజ్ ఫీచర్‌లను ధ్రువీకరించడానికి భూమిపై వాస్తవికత ఆధారంగా గ్రౌండ్ ట్రూటింగ్ సహాయపడుతుందన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా సర్వే ఉండాలని సూచించారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యాచరణ ప్రణాళిక, మార్గదర్శకాలు మేరకు సమయపాలన పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి, ఎంపీడీవో వెంకటరమణ, ఇవోపీఆర్డీ కేఎస్ వీరన్న, క్షేత్ర స్థాయి సర్వే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ అచ్యుత కుమారి



కానూరు అగ్రహారం సచివాలయంలో అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అచ్యుతకుమారి

పెరవలి: కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకి మృతి చెందుతున్నాయని, వాటి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు మాంసహారాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ డి.అచ్యుత కుమారి హెచ్చరించారు. పెరవలి మండలం కానూరు, కానూరు అగ్రహారం గ్రామాల్లో ఆమె సోమవారం పర్యటించి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి చికెన్ షాపుల యజమానులను వ్యాపారాలు 10 రోజుల పాటు నిర్వహించవద్దని, అలాగే కోళ్ల ఫారాల్లో పనిచేసే వ్యక్తులు, గడ్ల వ్యాపారం చేసే వారు, మాంసం దుకాణదారులు వ్యక్తి గత పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించారు. కానూరు అగ్రహారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత చేయడంతో పాటు గ్రామం అంతా బ్లీచింగ్ చేయించామని తెలిపారు. ప్రజలు కూడా వ్యక్తికి వ్యక్తికి దూరం పాటించి, మాంసాహారాలు తినొద్దని కోరారు. ఈ వ్యాధి ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యం, పశు సంవర్ధక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ, పశువైద్యాధికారి చరణ్, అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో చికెన్, గుడ్లు వాడకం నిషేధం

నిడదవోలు రూరల్: కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ కావడంతో 10 కిలోమీటర్ల పరిధిలోని నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కోడి మాంసం(చికెన్), కోడి గుడ్లు నిషేధం విధించినట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మండలంలోని మునిపల్లి, కలవచర్ల, జీడిగుంట, పెండ్యాల, కోరుపల్లి, డి.ముప్పవరం, పందలపర్రు గ్రామాల్లో చికెన్, కోడిగుడ్లు విక్రయించకుండా పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు

మంత్రి దుర్గేష్

నిడదవోలు : పెరవలి మండలం కానూరు అగ్రహారంలో 50 వేల కోళ్ల మృత్యువాత ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం స్పందించారు. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించామని, ప్రజలెవరూ భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చనిపోయిన 10 వేల కోళ్లను గొయ్యి తీసి పూడ్చి పెట్టే కార్యక్రమాన్ని అధికారులు పూర్తి చేశారని ఆయన పేర్కొన్నారు. మిగిలిన కోళ్లకు వైరస్ సోకకుండా అవసరమైన ముందు జాగ్రత్తలను అధికారులు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నాని భరోసా ఇచ్చారు. గ్రామంలో పౌల్ట్రీ సంబంధిత ప్రదేశాల్లో అధికారులు శానిటేషన్ ప్రక్రియ చేపట్టారన్నారు. ప్రాథమిక చికిత్స అందించేందుకు వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. కొంత కాలం గ్రామస్తులు చికెన్, గుడ్లకు దూరంగా ఉండాలని మంత్రి దుర్గేష్ సూచించారు. కానూరు అగ్రహారం గ్రామానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా పౌల్ట్రీ రైతులు బయో సెక్యూరిటీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వైరస్ సోకిన కోళ్లను తగిన జాగ్రత్తలతో పూడ్చిపెట్టాలని, వాటి తరలింపులో అత్యంత సురక్షిత మార్గాలను అనుసరించాలని ఆదేశించారు. చనిపోయిన కోళ్లను ప్రజలకు విక్రయించవద్దని మంత్రి దుర్గేష్ హెచ్చరించారు. కోళ్లకు వచ్చే వైరస్ మరింత వ్యాప్తి చెందకుండా ఫారాలు, ఫీడ్ స్టోరేజీ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. త్వరలో ముందస్తు టీకాను వేసి కోళ్లలో వ్యాధి నిరోధక శక్తిని పెంచేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

ఇసుక ర్యాంపు ఏర్పాటుపై ప్రజాభిప్రాయసేకరణ



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీఓ రాణీ సుస్మిత

నిడదవోలు రూరల్: గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కొవ్వూరు ఆర్డీఓ రాణీసుస్మిత స్పష్టం చేశారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామంలో నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాణీసుస్మిత మాట్లాడుతూ గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గ్రామ ప్రజలు పలువురు మాట్లాడుతూ ఇసుక ర్యాంపు ఏర్పాటుచేయడంతో కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూరి గ్రామాభివృద్ధి చెందుతుందన్నారు. మరికొంత మంది రైతులు మాట్లాడుతూ ర్యాంపు ఏర్పాటుచేయడం వల్ల వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో పాటు పొలాల్లోని గట్లు అధ్వానంగా తయారవుతాయని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై సమగ్రంగా చర్చించి ర్యాంపు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ నేలపూడి నాగమణి కోరారు. ఈకార్యక్రమంలో మైనింగ్ ఏడీ ఫణీభూషణ్ రెడ్డి, కాలుష్య కంట్రోల్ ఈఈ శంకరరావు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎస్సై కె.వీరబాబు, ఆర్ఐ సత్యేంద్ర, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏడు ర్యాంపుల్లో ప్రజాభిప్రాయ సేకరణ

కొవ్వూరు: డివిజన్‌లోని ఏడు ఇసుక ర్యాంపులకు పర్యావరణ అనుమతులు కేటాయింపుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మంగళవారం ఆరికిరేవుల ఇసుక ర్యాంపునకు సెప్షల్ డిప్యూటీ కలెక్టర్ (కేఆర్ఆర్‌సీ) ప్రజాభిప్రాయం సేకరిస్తారు, చిడిపి ర్యాంపునకు 13వ తేదీన స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారని తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. చిడిపిలో 48.30 హెక్టార్లు, ఆరికిరేవులలో 58.10 హెక్టార్లకు ఇసుక ర్యాంపుల కోసం ప్రతిపాదించినట్లు చెప్పారు. వీటితో పాటు తాళ్లపూడి మండలం ప్రక్కిలంక ఇసుక ర్యాంపు నిమిత్తం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సెప్షల్ కలెక్టర్ (పోలవరం కుడి కాలువ) ఆధ్వర్యంలోనూ, నిడదవోలు మండలం పెండ్యాల ఇసుక ర్యాంపు నిమిత్తం సెప్షల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్ఆర్‌సీ ఆధ్వర్యంలోనూ ప్రజాభిప్రాయం సేకరిస్తారని చెప్పారు. పెండ్యాలలో 13వ తేదీ ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తారు.

తాళ్లపూడి మండలంలో...

తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపునకు కొవ్వూరు ఆర్డీవో ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారు. ఈ ర్యాంపునకు 49.33 హెక్టార్లు ప్రతిపాదించారు. మునికొడవలి ర్యాంపునకు సంబంధించి ఈ నెల 13న స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు ప్రజాభిప్రాయం సేకరిస్తారు.

ఘనంగా లక్ష తమలపాకుల పూజ



నల్లాకులవారిపాలెంలో లక్షతమలపాకుల పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

పెరవలి: నల్లాకులవారిపాలెంలో ఉన్న భక్తాంజనేయ స్వామి 52వ ఏకాహ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆలయానికి సోమవారం మహిళలు పోటెత్తారు. స్వామివారికి తెల్లవారు జామున పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామి వారికి లక్ష తమలపాకులతో ఘనంగా పూజలు చేశారు. ఆలయంలో మూలవిరాట్‌ను తమలపాకుల్లో నిండి ఉండడంతో భక్తులు దర్శించుకున్నారు. సోమవారం స్వామివారి ఆలయంలో 150 మంది పిల్లలకు, పెద్దలకు పటికబెల్లం తులాభారం నిర్వహించగా 2300 కిలోలు వచ్చిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఉచిత భోజనాలు ఏర్పాటు చేయగా పిల్లలకు పాలను అందించారు.

భూ ఆధార్ నమోదు చేయించుకోవాలి

చాగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా తమ భూములకు ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య (భూ ఆధార్) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. వేణుగోపాల్ సూచించారు. చాగల్లులోని రైతు సేవా కేంద్రంలో సోమవారం భూ ఆధార్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత భూమి కలిగిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డు తరహాలో 14 అంకెల యూనిక్ ఐడీ కార్డులు అందించనున్నట్టు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు, రాయితీలు, సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరి అన్నారు. రైతులు భూమి పట్టాదార్ పాసుపుస్తకం నకలు, 1బి, ఆధార్ జెరాక్స్, బ్యాంకు ఖాతాకు లింకైన ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రంలో విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని సూచించారు.

బ్యాలెట్ పద్ధతిలోనే ప్రజాస్వామ్యానికి మనుగడ

రాజమహేంద్రవరం సిటీ: ఈవీఎంలతో ఎన్నికలు జరిగినన్నాళ్లూ మోదీ, అమిత్ షాలను ఎవ్వరూ ఓడించలేరని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. అధికార పార్టీ చేతిలో ఎన్నికల సంఘం కీలుబొమ్మగా మారిపోయిందని, దానిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు



గుడ్డిగూడెంలో రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ చినరాముడు

గోపాలపురం: భూముల రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు అన్నారు. మండలంలోని గుడ్డిగూడెంలో జరుగుతున్న రీసర్వే పనులను సోమవారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీ సర్వే పూర్తయితే గ్రామాల్లోని భూ సమస్యలు తగ్గుముఖం పడతాయన్నారు. ఇప్పటికే జిల్లాలో రీసర్వే ద్వారా అనేక మంది రైతుల సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో రెవెన్యూ అధికారుల ద్వారా జరిగిన తప్పులను సరిచేస్తున్నట్టు తెలిపారు. సమగ్ర సర్వే చేసి భూముల హద్దులు, వాటి వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తున్నామన్నారు. భూముల క్రయ విక్రయాలకు ఎటువంటి ఆటంకం లేకుండా సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం గోపాలపురం సివిల్ సప్లై గోదామును పరిశీలించి నిత్యావసరాల పంపిణీపై అధికారులను ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి నిల్వల్లో తేడాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కె.అజయ్‌బాబు, వీర్వోలు, సర్వే సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ నుంచి ప్రైమరీ పాఠశాలకు..

గోపాలపురం: ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా అంగన్‌వాడీ సెంటర్ నుంచి 10 మంది విద్యార్థులను ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలకు తరలించినట్లు పాఠశాల హెచ్ఎం బి వెంకటలక్ష్మి తెలిపారు. సోమవారం ఉప్పరగూడెం అంగన్‌వాడీ సెంటర్ నుంచి అయిదు సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులను ప్రీ ప్రైమరీ సర్టిఫికేట్‌తో పాఠశాలలో చేర్పించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ కొయ్య నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్త అయినపర్తి వెంకటలక్ష్మి, హెల్పర్లు పాల్గొన్నారు.

నిమ్మ, ఆయిల్‌పామ్‌లో సస్యరక్షణ చేపట్టాలి



నిమ్మతోటలో సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న శాస్త్రవేత్త రేఖ

నల్లజర్ల: నిమ్మ, ఆయిల్‌పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డాక్టర్ వైఎస్సార్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇ.రేఖ సూచించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యాన అయ్యవరం సర్పంచ్ గుడిసే వీరాస్వామి అధ్యక్షతన నిమ్మ, ఆయిల్‌పామ్ తోటలకు సంబంధించి వివిధ అంశాలపై ఆమె రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. నిమ్మలో నత్రజని 25 శాతం ఎరువులు, పశువుల ఎరువు రూపంలో 25 శాతం వేపపిండి, మిగిలిన 50 శాతం రసాయన ఎరువు రూపంలోను డిసెంబర్, జనవరిలో మొదటి దఫా, జూన్, జూలై నెలల్లో రెండో దఫా వేయాలని సూచించారు. ఎస్ఎస్‌పి, ఎంఒపి రెండు దఫాల్లో సమపాళ్లలో వేయాలన్నారు. వేరు మూలల నుంచి పెరిగే కొమ్మలను కత్తిరించాలన్నారు. కాండంపై రెండడుగుల ఎత్తు, లోపల వరకూ పక్క కొమ్మలను కత్తిరించాలన్నారు. కత్తిరించిన కొమ్మ చివరన బోర్డోపేస్ట్ పూయాలని సూచించారు. ధరలు బాగా ఉండే సీజన్‌ను గుర్తించి, ఆ సమయానికి పూత వచ్చేలా నీటి తడులు అందించాలన్నారు. జనవరిలో ఎక్కువ పూత రావడానికి డిసెంబర్‌లో పూర్తిగా నీరు ఇవ్వడం ఆపాలన్నారు. డిసెంబర్ చివరిలో మొక్క చుట్టూ పాదులు చేసి, 10 సెంటీమీటర్ల లోతులో గుల్ల చేసి, సూచించిన మోతాదులో ఎరువులు వేసి, నీరు అందిస్తే నెల రోజుల్లో పూత వస్తుందన్నారు. ఎండలు ముదిరేకొద్దీ క్రమం తప్పకుండా నీటి తడులు అందించాలని రేఖ సూచించారు. ఉద్యానశాఖాధికారి బబిత మాట్లాడుతూ, పంట మార్పిడి అవలంబించాలని, మార్కెట్ రేటును ముందుగా అంచనా వేసి పంటను ఎంపిక చేసుకోవాలని అన్నారు.